
సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 7 । జూన్ । 2024



యాదాద్రిలో బదిలీలు జరిగేనా..

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఏళ్ల తరబడి ఉద్యోగులు బదిలీలు జరగడం లేదు.

- 8లో



భువనగిరి అభివృద్ధికి కృషి

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

- 10లో

గరిష్టం / కనిష్టం 37° / 26°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

8వ తేదీ వరకు ఎన్నికల కోడ్

సాక్షి, యాదాద్రి : జిల్లాలో ఈనెల 8వ తేదీ సాయంత్రం వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు ముగిసినందున కేంద్ర ఎన్నికల సంఘం గురువారం సాయంత్రం కోడ్ ఎత్తి వేసిందన్నారు. యాదాద్రి జిల్లాలో మాత్రం వరంగల్– ఖమ్మం– నల్లగొండ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో కోడ్ కొనసాగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం 8వతేదీ సాయంత్రం కోడ్ ఎత్తివేయనున్నట్లు పేర్కొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

భువనగిరి రూరల్ : బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఈఓ నారాయణరెడ్డి కోరారు. గురువారం ఆయన భువనగిరి మండలంలోని అనాజిపురం ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బడీడు, బడి బయట పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, సీఎంఓ పెసరు లింగారెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాయపురం ప్రీతి, పంచాయతీ కార్యదర్శి బట్టు స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో అధిక దిగుబడి



భూసార కిట్లు పంపిణీ చేస్తున్న డీఏఓ

సంస్థాన్ నారాయణపురం : మొక్కలుకు సరైన పోషకాలు అందించినప్పుడే ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడి ఇస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ(డీఏఓ) పేర్కొన్నారు. షెడ్యూల్ తెగల ఉప ప్రణాళిక పథకంలో భాగంగా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని వావిళపల్లిలో రైతులకు భూసార పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. కిట్ల ద్వారా భూసార పరీక్షలు నిర్వహించే విధానంపై అవగాహన కల్పించారు. మొక్కలకు సరైన పోషకాలు అందించడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపెల్లి రత్నాకర్, శాస్త్రవేత అనిల్‌కుమార్, ఏఓ నాగరాజు, ఏఈఓలు నవీన్, అరుణ, పరశురాములు, శివ, శశిబింధు పాల్గొన్నారు.

రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలి



మోత్కూరులోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మోత్కూరు,గుండాల, సంస్థాన్‌నారాయణపురం: విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు విధిగా రశీదులు ఇవ్వాలని డీలర్లకు జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ పద్మావతి సూచించారు. గురువారం మోత్కూరు, గుండాల, సంస్థాన్‌నారాయణపురం, వావిళ్లపల్లిలో ఎరువులు, విత్తన దుకాణాల్లో ఇంటర్నల్ స్క్వాడ్ బృందంతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఎరువుల దుకాణాల యజమానులు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, లేనిచో చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలను బోర్డులపై, రిజిస్టర్లలో నమోదు చేయాలని, ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఆదేశించారు.

ఆటుపోట్లు అధిగమించి..

తిరుగులేని శక్తిగా ఎదిగిన కాంగ్రెస్

- అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు స్థానాలు కైవసం
- లోక్‌సభ ఎన్నికల్లోనూ ఘన విజయం
- భారీగా పెరిగిన ఓటు బ్యాంకు



సాక్షి యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్న కాంగ్రెస్ పార్టీ తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంది. బీఆర్‌ఎస్‌కు కంచుకోటగా ఉన్న యాదాద్రి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నుంచి మళ్లీ హస్తం హవా మొదలైంది. ఇటీవల భువనగిరి లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లోనూ ఘన విజయం సాధించి తిరుగులేని శక్తిగా ఆవిర్భవించింది.

పరాజయాల నుంచి విజయ పథం వైపు

2009లో జరిగిన ఎన్నికల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉండగా ఆ తర్వాత సీన్ మారింది. 2014నుంచి 2023 డిసెంబర్ వరకు ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. వరుస పరాజయాలతో చతికిలపడ్డ కాంగ్రెస్.. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పడిలేచిన కెరటంలా ఎగిసింది. భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, నకిరేకల్ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు తిరుగులేని విజయాలు అందుకున్నారు. ఇక.. ఒక వెలుగు వెలిగిన బీఆర్‌ఎస్ పార్టీ పోటీ చేసిన అన్ని చోట్ల ఓటమిపాలైంది. బీజేపీకి డిపాజిట్ కూడా రాలేదు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ రాగా బీజేపీ రెండు, బీఆర్‌ఎస్ మూడో స్థానానికి పరిమితం అయ్యాయి.

బీఆర్‌ఎస్‌ను తట్టుకుని..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తెలంగాణ ఉద్యమ కేంద్రంగా ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బీఆర్‌ఎస్‌ను తట్టుకుని నిలబడింది. పడిలేచిన కెరటంలా ఆటుపోట్లను అధిగమించి 2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో తిరుగులేని విజయాన్ని నమోదు చేసింది. ఉద్యమ పార్టీగా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి ఎంపీగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విజయం సాధించగా, ఆలేరు, నకిరేకల్ ఎమ్మెల్యేలుగా బూడిద భిక్షమయ్యగౌడ్, చిరుమర్తి లింగయ్యలు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. భువనగిరి, తుంగతుర్తినుంచి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, మునుగోడు నుంచి సీపీఐకి చెందిన పల్లా వెంకట్‌రెడ్డి విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీగా బూర నర్సయ్యగౌడ్ విజయం సాధించారు.ప్రధానంగా 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి నకిరేకల్ ఎమ్మెల్యేగా గెలిచిన చిరుమర్తి లింగయ్య వెంటనే బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. మునుగోడు నుంచి గెలిచిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 2022లో బీజేపీలో చేరారు. వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ చేతిలో ఓడిపోయారు. తిరిగి 2023లో కాంగ్రెస్‌లో చేరిన రాజగోపాల్‌రెడ్డి మునుగోడులో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరి గెలుపొందారు. ఇక తుంగతుర్తిలో బీఆర్‌ఎస్‌కు చెందిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మందుల సామేల్ కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రెండు పర్యాయాలు గెలిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయం దుందుభి మోగించారు. అదే జోష్‌లో ఎంపీ ఎన్నికల్లో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో కాంగ్రెస్ కేడర్‌లో జోష్ పెరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సానుకూల ఫలితాలు వస్తాయన్న నమ్మకం కాంగ్రెస్ శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది.

స్వల్పంగా తగ్గిన మెజారిటీ

2023 అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో జనగామ మినహా మిగతా అన్ని చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. వారికి సుమారు 2.80 లక్షల మెజార్టీ వచ్చింది. కాగా అసెంబ్లీ ఎన్నికల నాటికి పోలిస్తే లోక్‌సభలో ఎన్నికల్లో మెజార్టీ కొంత తగ్గి 2.22 లక్షలకు పరిమితం అయ్యింది. మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లో లక్షకుపైగా మెజార్టీ రాగా ఇబ్రహీంపట్నం, ఆలేరు, భువనగిరి, నకిరేకల్‌లో కొంత తగ్గింది. సామాజిక సమీకరణలు, మోదీ చరిష్మా వంటి కారణాలతో మెజార్టీ తగ్గిందన్న చర్చ జరుగుతోంది.

నాలుగు ఎన్నికల్లో ఇలా..

అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో వరుస ఓటములు చవిచూసిన కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం పైచేయి సాధిస్తూ వస్తోంది. 2009లో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గం ఏర్పాడగా ఇప్పటి వరకు నాలుగు దఫాలు ఎన్నికలు జరిగాయి. మొదటి సారి మహాకూటమి అభ్యర్థి సీపీఎంకు చెందిన నోముల నర్సింహయ్యపై కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి 1,39,462 ఓట్లతో గెలుపొందారు. 2014లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలోకి దిగిన బూర నర్సయ్య గౌడ్.. కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిపై 30,532 ఓట్లతో విజయం సాధించారు. 2019లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌పై 5,412 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన బూర నర్సయ్యగౌడ్‌పై చామల కిరణ్ కుమార్‌రెడ్డి 2,22,170 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు.

2009 నుంచి భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో వచ్చిన ఓట్లు

అసెంబ్లీ సెగ్మెంట్	2009	2014	2019	2024
భువనగిరి	6,6347	5,4738	73,677	74,319
ఆలేరు	8,1844	73,207	72,063	76,730
తుంగతుర్తి	7,9284	73,207	76,424	1,03,087
నకిరేకల్	7,7415	66,150	86,941	96,914
మునుగోడు	67,710	52,536	79,843	1,08,667
ఇబ్రహీంపట్నం	57,059	50,272	80,539	88,013
జనగామ	72,946	64,969	62,544	76,032
మొత్తం	5,02,605	4,16,371	5,32,031	6,23,762

2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో..

నియోజకవర్గం	లోక్‌సభ	అసెంబ్లీ	ఓట్ల తేడా
భువనగిరి	74,319	1,02,742	28,423
ఆలేరు	76,730	1,22,140	45,410
జనగామ	76,032	83,192	7,160
నకిరేకల్	96,914	1,33,540	36,626
తుంగతుర్తి	1,03,087	1,29,535	26,448
ఇబ్రహీంపట్నం	88,013	1,26,506	38,493
మునుగోడు	1,08,667	1,19,624	10,957

భూదాన్‌పోచంపల్లిలో భారీ వర్షం



భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లి పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు ఎడతెరపిలేకుండా కురిసిన వర్షానికి ప్రధాన రహదారి జలమయం అయ్యింది. వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

3.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- పూర్తయిన కొనుగోళ్లు
- సీఎంఆర్ ఇవ్వడంలోనూ ముందుండాలి
- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరిటౌన్ : యాసంగి ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 3.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. అనుకున్న సమయం కంటే ముందుగానే ధాన్యం సేకరణ పూర్తయిందని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు వెల్లడించారు. 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యం కాగా 3.37 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. గత యాసంగి కంటే నెల రోజుల ముందుగానే కొనుగోళ్లు పూర్తి చేశామని తెలిపారు. సీఎంఆర్ అప్పగించే విషయంలో రాష్ట్రంలో ముందు నిలవాలని మిల్లర్లు, అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు.సమావేశంలో పౌర సరఫరాల జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపికృష్ణ, డీఆర్‌డీఓ కృష్ణన్, డీసీఓ ప్రవీణ్, డీఏఓ అనురాధ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ధాన్యం కొనుగోళ్లకు సహకరించిన అధికారులు, సిబ్బందికి పౌర సరఫరాల కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్, కలెక్టర్ హనుమంతు కే.జెండగే కృతజ్ఞతలు తెలిపారు.

యాదాద్రిలో నిత్యారాధనలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. శ్రీస్వామి, అమ్మవార్ల మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆయ మాడ వీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, నిత్యకల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- గ్రూప్–1 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు
- 9 కేంద్రాలు, 3,349 మంది అభ్యర్థులు
- పరీక్ష నిర్వహణపై అధికారులకు శిక్షణ



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : గ్రూప్–1 ప్రిలిమనరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్, ఐడెంటిఫికేషన్, బయోమెట్రిక్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు గ్రూప్–1 పరీక్ష నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. టీజీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 9న ప్రిలిమనరీ పరీక్ష నిర్వహించనున్నారని, అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లోకి ఇతరులను అనుమతించవద్దని, పరీక్ష రోజు ప్రతి సెంటర్‌ను మూడుసార్లు సందర్శించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎవరైనా చేతులు లేకపోతే సహాయకుల కోసం ముందుగానే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల సమాచారం, హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకునే విధానం గురించి హెల్ప్ లైన్ నంబర్లు 8331997006, 8331997037 సంప్రదించవచ్చన్నారు. హాల్‌టికెట్‌ను టీజీపీఎస్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఏ4 పేపర్‌పై ప్రింట్ తీసుకోవాలని పేర్కొన్నారు. హాల్ టికెట్‌పై అభ్యర్థులు తమ పాస్ ఫొటో అతికించాలన్నారు. సమావేశంలో డీఈఓ నారాయణరెడ్డి, టీజీపీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ బాలాజీ, వ్యవసాయ శాఖ ఏడీఏ నీలిమ తదితర అధికారులు పాల్గొన్నారు.

3,349 మంది అభ్యర్థులు

గ్రూప్–1పరీక్షకు 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 3,349 అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరగనుంది. 9నుంచి 10 గంటల వరకు కేంద్రంలోకి అనుమతి ఇవ్వనున్నారు. ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా ఎంట్రీ ఉండదని కలెక్టర్ తెలిపారు.

వీటిని అనుమతించరు

పరీక్ష కేంద్రంలోకి వాటర్ బాటిళ్లను అనుమతించరు. ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, గడియారాలు, బ్యాగ్‌లు, బ్లూ టూత్ డివైస్‌లు, పెన్ డ్రైవ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, తెల్ల కాగితాలకు అనుమతి లేదు.పరీక్ష కేంద్రం వద్ద వస్తువులు భద్రపరచడానికి ఎటువంటి సౌకర్యం కల్పించడం లేదు.

అభ్యర్థులు ఇవి పాటించాలి

- అభ్యర్థులు ఆధార్, పాన్, ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్టుతో పాటు ఫొటోతో కూడిన ప్రభుత్వ గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒకటి తీసుకెళ్లాలి.
- బ్లూ, బ్లాక్‌బాల్ పాయింట్ పెన్నులను మాత్రమే తీసుకెళ్లాలి.
- హాల్ టికెట్‌పై ఫొటో సరిగా కనిపించని పక్షంలో గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన మూడు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, అండర్‌టేకింగ్ ఫామ్ పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాలి. వీటిని ఇన్విజిలేటర్‌కు సమర్పిస్తేనే అభ్యర్థిని పరీక్షకు అనుమతిస్తారన్నారు.
- పరీక్ష సమయం పూర్తయ్యే వరకు అభ్యర్థులు హాల్ నుంచి బయటకు రావద్దు. బయటకు వచ్చేటప్పుడు ఓఎంఆర్ ఆన్సర్ షీట్ ఇన్విజిలేటర్‌కు ఇవ్వాలి.
- అభ్యర్థి తన బయోమెట్రిక్‌ను క్యాప్చర్ చేసిన తర్వాతే హాల్ నుంచి బయటకు రావాలి. బయోమెట్రిక్ క్యాప్చర్ చేయకపోతే ఓఎంఆర్ ఆన్సర్ షీట్ మూల్యాంకనం చేయడదు.

బదిలీలు, పదోన్నతులపై ఆశలు

- ఈ నెల 20లోపు ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందం
- జిల్లాలో 613 ఖాళీలు



భువనగిరి : ఏళ్లుగా బదిలీలు, పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆశలు రేకెత్తిస్తోంది. ఈ నెల 7నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టి 20వ తేదీ వరకు పూర్తి చేస్తామని ప్రకటించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. ఇప్పటికే జిల్లాలో ఖాళీల వివరాలు సేకరించారు. గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టుల ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశారు.

స్పౌజ్ కేటగిరీ వారికి అవకాశం

వేర్వేరు ప్రాంతాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయ దంపతులను స్పౌజ్ కేటగిరీ కింద ఒకే చోటకు బదిలీ చేసే అవకాశం ఉండడంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు కుటుంబాలకు దూరంగా ఉంటూ వేర్వేరు ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయ దంపతులు అసంతృప్తితో ఉన్నారు. అతేకాకుండా జిల్లాలకు జనాభా ప్రతిపాదికన ఉద్యోగులు, ఉపాధ్యాయులను కేటాయించాలంటూ గత ప్రభుత్వం జీఓ 317కింద సర్దుబాటు చేసింది. ఇందులో ఉపాధ్యాయులు చాలా మంది సొంత జిల్లాల నుంచి పొరుగు జిల్లాలకు వెళ్లాల్సి వచ్చింది. రేండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు తాజాగా చేపట్టనున్న బదిలీలకు అర్హులని ప్రభుత్వం పేర్కొనడంతో వీరికి అవకాశం రానుంది.

ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు

జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల పరిధిలో 3,465 మంది ఉపాధ్యాయ పోస్టులు ఉన్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ 1,574 మందికి గాను 1,214, ఎస్‌జీటీలు 1,360 మందికి 1,217, లాంగ్వేజ్ తెలుగు పండిత్‌లు 129కి 113 మంది, హిందీ 77 మందికి 73, పీఈటీలు 84కు 82 మంది పనిచేస్తున్నారు. 613 ఖాళీలు ఉన్నాయి.

ఖాళీల వివరాలు సేకరించాం

విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపడుతాం. ఇప్పటికే జిల్లాలో ఖాళీల వివరాలు సేకరించాం. గెజిటెడ్ హెచ్‌ఎంల ఖాళీల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం. అధికారికంగా ఆదేశాలు రావల్సి ఉంది.

–కె.నారాయణరెడ్డి, డీఈఓ

ఫలితంపై ఉత్కంఠ

రెండు రోజులుగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు

- మొదటి ప్రాధాన్యతలో ఎవరికీ దక్కని విజయం
- తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు
- గెలుపు టార్గెట్ 1,55,095 ఓట్లు
- మొదలైన రెండో ప్రాధాన్యత ఓట్ల కౌంటింగ్
- నేడు తేలనున్న తుది ఫలితం



బ్యాలెట్ పత్రాలను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

నల్లగొండ: రెండు రోజులుగా కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపుపై ఉత్కంఠ నెలకొంది. వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ గెలుపునకు సరిపడా ఓట్లు రాలేదు. గెలుపు కోసం 1,55,095 ఓట్లు రావల్సి ఉండగా కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు మాత్రమే వచ్చాయి. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరూ విజయం సాధించకపోవడంతో ఎన్నికల అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియ ద్వారా రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తున్నారు. 52 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన చివరి అభ్యర్థిని ఎలిమినేట్ చేస్తూ.. వారికి వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియ గురువారం రాత్రి 10 గంటలకు ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం ఫలితం తేలే అవకాశం ఉంది. గత నెల 27న జరిగిన పోలింగ్‌లో 3,36,013 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ఆ రోజు 4 గంటల వరకు బండిల్స్ కట్టడమే పూర్తయింది. సాయంత్రం 5 గంటలకు మొదటి ప్రాధాన్యత ఓట్ల కౌంటింగ్‌ను ప్రారంభించారు. 4 హాళ్లలో 96 టేబుళ్ల మీద ఒక్కో రౌండ్‌కు 96 వేల చొప్పున ఓట్లను లెక్కించారు. గురువారం రాత్రి 9గంటల వరకు నాలుగు రౌండ్లలో మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఆ తర్వాత రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు చేపట్టారు. మొత్తం పోలైన ఓట్లలో చెల్లని ఓట్లు తీసేసి చెల్లిన ఓట్లలో గెలుపు టార్గెట్ నిర్ణయించారు. 1,55,095 ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు.

అభ్యర్థుల్లో టెన్షన్

మొదటి ప్రాధాన్యత ఓట్లలో మల్లన్న 18,565 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ఆయన గెలుపునకు ఇంకా 32,283 ఓట్లు రావాలి. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలవాలంటే 50,847 ఓట్లు అవసరం ఉంది. రెండో ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితం తేలనుంది. రెండో ప్రాధాన్యతలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేసి రెండో ప్రాధాన్యత లెక్కించే క్రమంలో 10 వేల ఓట్లు వచ్చిన అభ్యర్థులందరినీ ఎలిమినేట్ చేసి వారి రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. అప్పటికి కూడా ఎవరికి గెలుపునకు కూడా సరిపడా ఓట్లు వచ్చే అవకాశం లేకపోతే.. ఆ తర్వాత స్వతంత్ర అభ్యర్థి అశోక్ ఓట్లను ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన 29,697 ఓట్లలో రెండో ప్రాధాన్యత ఎవరికి పడ్డాయో ఆ ఓట్లను లెక్కిస్తే గెలుపునకు దగ్గరగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. దాంతో కూడా తేలకపోతే.. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తేనే చివరి ఫలితం వెలువడే అవకాశం కనిపిస్తోంది.

మొదటి ప్రాధాన్యతలో వచ్చిన ఓట్లు ఇలా..

మొదటి ప్రాధాన్యతలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు 1,22,813 ఓట్లు వచ్చాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. అదే విధంగా స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కు 29,697 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. మిగిలిన వారికి అతి తక్కువగా ఓట్లు రావడం జరిగింది. అయితే ఇందులో గెలుపుకు నిర్ణయించిన టార్గెట్ ప్రకారం ఏ అభ్యర్థికీ ఓట్లు రాలేదు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి



పోలీసులతో సమావేశమైన సూపరింటెండెంట్ సైదులు, ఏసీపీ మధుసూదన్‌రెడ్డి

చౌటుప్పల్ : బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు, చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూధన్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం చౌటుప్పల్ ఏసీపీ కార్యాలయంలో సివిల్ పోలీస్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బందితో వారు సమావేశం అయ్యారు. బెల్టు దుకాణాల మూసివేత, గిరిజన తండాల్లో సారా తయారీ నిర్మూలనపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునుగోడు నియోజకవర్గంలో బెల్టు దుకాణాల మూసివేత ఇప్పటికే కొనసాగుతుందన్నారు. యాదాద్రి జిల్లాకు సంబంధించి చౌటుప్పల్, నారాయణపురం మండలాల్లో మూసివేయాల్సి ఉందన్నారు. ఈ రెండు మండలాల్లో బెల్ట్ దుకాణాల మూసివేతకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ మథావిధిగా అమ్మకాలు సాగిస్తున్నారని తెలిపారు. వారంతా తక్షణమే బెల్ట్ షాపులు మూసివేయాలని, లేనిపక్షంలో కేసుల నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. మద్యం వ్యాపారులు బెల్ట్ షాపులను ప్రోత్సహించవద్దని తెలిపారు. సమావేశంలో సివిల్ సీఐ ఆశోక్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐలు బాలోజీనాయక్, రాధాకిషన్, ఎక్సైజ్ ఎస్‌ఐ శంకర్, సివిల్ ఎస్‌ఐ జగన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 8 మంది అరెస్ట్
- 14 బైక్‌లు, రూ.78 వేలు స్వాధీనం

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లసింగారంలో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు చౌటుప్పల్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో నివాసముంటూ స్థానికంగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరితో పాటు మరికొంత మంది కలిసి తాళ్లసింగారం గ్రామంలోని రహస్య ప్రాంతంలో పేకాట శిబిరం ఏర్పాటు చేసుకున్నారు. పక్కా సమాచారం అందుకున్న పోలీసులు గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి వాలెపు శ్రీను, పేరం బ్రహ్మయ్య, నేలపాటి డానియేలు, కుంచాలి శ్రీను, తానేరు ఆదినారాయణ, తానేరు నర్సింహారావు, చెంచు గోపి, తానేరు అంకంరాజును అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా 14 బైక్‌లు, రూ.78 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం



క్రిష్ణవేణి


యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైందని ఆమె కుటుంబ సభ్యులు గురువారం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట గ్రామానికి చెందిన జెట్రిపోతుల క్రిష్ణవేణి (18) ఈ నెల 4వ తేదీ నుంచి కనబడడం లేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. కాగా క్రిష్ణవేణి చిన్నతనంలోనే తల్లిదండ్రులు మృతిచెందగా.. ఆమె తన మేనత్త హేమలత వద్ద ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. క్రిష్ణవేణికి మతిస్థిమితం సరిగ్గా లేదని కూడా పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలియజేశారు.

అట్రాసిటి కేసు నమోదు

గుండాల : కులం పేరుతో దూషిస్తూ దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దపడిశాల గ్రామానికి చెందిన మల్లెబోయిన రమేష్, నర్సయ్య, బాలయ్య, సోమయ్య, పవన్, పరశురాములు అదే గ్రామానికి చెందిన అల్లె ఉపేందర్ తమ వ్యవసాయ బావి వద్ద పనులు చేసుకుంటుంటే దూషిస్తూ దాడి చేశారు. సదరు వ్యక్తులు దాడి చేయడంతో బాధితుడి సోదరుడు అల్లె మల్లేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు విచారణ చేపట్టి అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాకన్న తెలిపారు.

యాదాద్రిలో బదిలీలు జరిగేనా..

- ఏళ్ల తరబడి ఒకే చోట విధులు
- క్లర్క్, రికార్డు అసిస్టెంట్‌గా చేరి ఇక్కడే పదోన్నతులు
- ఉమ్మడి రాష్ట్రంలో 2011–12లోనే చివరగా బదిలీలు



యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పనిచేస్తున్న వారు చాలా ఏళ్లుగా అక్కడే పనిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని, తమ బంధువులకే ఆలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 15–20 ఏళ్ల క్రితం క్లర్క్, రికార్డు అసిస్టెంట్లుగా విధుల్లో చేరి.. ఇప్పుడు సూపరింటెండెంట్లు, ఏఈఓలు, డీఈవోలుగా పదోన్నతులు పొంది ఇక్కడే పాతుకుపోయి ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

యాదాద్రిలో 280 మినిస్టీరియల్ సిబ్బంది...

రాష్ట్రంలో ఆర్.జే.సీ క్యాడర్ కింద యాదాద్రి, భద్రాచలం, వేములవాడ ఆలయాలు ఉండగా.. డిప్యూటీ కమిషనర్ హోదా కిందా కొమురవెల్లి, హైదరాబాద్‌లోని గణేష్ టెంపుల్, బాసర ఆలయాలు ఉన్నాయి. ఆయా ఆలయాల్లో ఉన్న ఉద్యోగుల బదిలీలు త్వరలోనే జరిగే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. యాదాద్రి ఆలయంలో మొత్తం 280 ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. ఇందులో రికార్డు అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఏఈఓలు, సివిల్, విద్యుత్ విభాగానికి చెందిన ఏఈ, ఈఈ, డీఈలు ఉన్నారు. వీరిలో 50 మందికి పైగా ఉద్యోగులకు బదిలీలు వర్తిస్తాయనేది ఆలయంలో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. ఈ బదిలీల్లో రికార్డు అసిస్టెంట్ల నుంచి డీఈఓ స్థాయి ఉద్యోగులు వరకు ఉంటారనేది విశ్వసనీయంగా తెలుస్తుంది. ఇదిలా ఉండగా.. యాదాద్రి ఆలయంలో బదిలీలు చేయాలని ఇటీవలనే ఉన్నతాధికారులకు ఫైల్ వెళ్లినట్లు తెలిసింది.

పదమూడేళ్ల క్రితం బదిలీలు..

యాదాద్రి ఆలయంలో చివరగా ఉమ్మడి రాష్ట్రంలో 2011–12లో బదిలీలు జరిగాయి. యాదాద్రి ఆలయం నుంచి కొమురవెల్లి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం, బాసర వంటి దేవాలయాలకు పలువురు ఉద్యోగులు బదిలీలపై వెళ్లారు. అంతేకాకుండా ఇక్కడ విధులు నిర్వహించిన ఏఈఓ చంద్రశేఖర్ ఒక్కడే నాలుగేళ్ల క్రితం అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీపై వేరే జిల్లాకు వెళ్లారు. ఇప్పటికి పదమూడేళ్లవుతున్నా యాదాద్రి దేవస్థానంలో ఉద్యోగులు బదిలీలు జరగలేదు. దీంతో ఉద్యోగులంతా అక్రమాలకు పాల్పడటంతో పాటు, తమ కుటుంబ సభ్యులను వివిధ విభాగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా యాదాద్రి ఆలయంలో మొదటిసారిగా ఉద్యోగంలో చేరిన వారంతా ఇప్పుడు హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్టకు వెళ్లి వస్తున్నారని స్థానికంగా ఉన్న ప్రజలు అంటున్నారు. గతంలో ఆయా ఆలయాలకు బదిలీపై వెళ్లినప్పటికి.. తిరిగి రాజకీయ పైరవీలు చేసుకొని యాదాద్రి ఆలయానికే వచ్చారని స్థానికులు చెబుతున్నారు.

జాబితా సిద్ధం చేసిన దేవాదాయశాఖ..?

దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. దీంతో ఆ జాబితాలో తమ పేర్లు ఉన్నాయా.. ఉంటే ఏ ఆలయానికి వెళ్తామనే ఆలయ ఉద్యోగులు ఆరా తీస్తున్నారు. తాము బదిలీ కాకుండా ఉండేందుకు ఇప్పటికే పలువురు ఉద్యోగులు దేవాదాయశాఖలో ఉన్న ఉన్నతాధికారుల చుట్టు తిరుగుతున్నట్లు సమాచారం.

ఎన్నికలు ఉండటంతో ఆగిన బదిలీలు..

లోక్‌సభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో యాదాద్రి ఆలయంలో పలువురి బదిలీలు నిలిచిపోయాయని తెలుస్తోంది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బదిలీల ప్రక్రియ ఊపందుకునే అవకాశం ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. యాదాద్రి ఆలయానికి మరింత ఆదాయం పెరగాలంటే.. ఇక్కడ ఉన్న ఉద్యోగుల బదిలీలు జరగాలని ఆయా పార్టీల నాయకులు సైతం గతంలోనే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.. ఆలయంలో ప్రధాన బాధ్యతల్లో ఉన్న పలువురు ఉద్యోగులు ఇటీవల కాలంలో బదిలీలు జరగకుండా చూడాలని ఉన్నతాధికారులను కలిసినట్లు సమాచారం.

బదిలీలు జరుగుతాయని ఆశిస్తున్నాం



యాదాద్రి ఆలయంలో ఏళ్ల తరబడి బదిలీలు జరగలేదు. దీంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇక్కడి ఉద్యోగులు బదిలీలు కాకుండా పైరవీలు చేసుకొని, అక్రమాలకు పాల్పడుతున్నారు. యాదాద్రి ఆలయానికి ఈఓగా రెవెన్యూ అధికారిని కాకుండా.. ఐఏఎస్ అధికారిని నియమించాలి. బదిలీలపై, ఐఏఎస్ అధికారిని నియమించాలని గత ప్రభుత్వానికి, దేవాదాయశాఖ అధికారులకు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్నవించుకున్నాం.

– క్షౌరం కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

ఉద్యోగుల ఆస్తులపై విచారణ చేపట్టాలి



ఆలయంలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలి. క్లర్క్ స్థాయి నుంచి జూనియర్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, ఏఈఓలుగా ఇక్కడే పదోన్నతి పొంది, ఒకే శాఖలో విధులు నిర్వహిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఇక్కడ ఏఈఓగా బాధ్యతలు చేపట్టిన చంద్రశేఖర్ బదిలీపై ఇతర జిల్లాకు ఆర్.జే.సీగా వెళ్లారు. కానీ.. మిగతా ఉద్యోగులను ఎందుకు బదిలీ చేయలేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడి ఉద్యోగుల బదిలీలను వెంటనే ప్రారంభించాలి.

– కర్రె ప్రవీణ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై ఫిర్యాదు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నిక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ కె. వెంకటేశ్వర్లు తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లిలో గల ఎఫ్‌సీఐ గోదాములలో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ కేంద్రం–2లోకి బుధవారం రాత్రి కంచర్ల భూపాల్‌రెడ్డి వచ్చి బ్యాలెట్ పత్రాలు తమకు చూపించడం లేదని బెదిరించినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ హాల్–3కు సంబంధించిన ఏజెంట్ పాస్‌తో కౌంటింగ్ హాల్–2లోకి వచ్చి తమ విధులకు ఆటంకం కలిగించడంతో అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తిప్పర్తి ఎస్ఐ డి. రాజును వివరణ కోరగా.. ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తామని తెలిపారు.

635.55 అడుగులకు చేరిన మూసీ నీటిమట్టం

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టులో నీటిమట్టం 635.55 అడుగులకు చేరుకుంది. మూడు రోజులుగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంతో పాటు మూసీ ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ వాగు ద్వారా మూసీ రిజర్వాయర్‌లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. గురువారం ఎగువ నుంచి మూసీకి 615 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 635.55 అడుగులకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 2.29 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులో మరో ఎనిమిది అడుగుల నీరు చేరితే పూర్తిస్థాయిలో నిండుతుంది. ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో ఆయకట్టుకు వానాకాలం పంటసాగుకు నీటి విడుదలకు డోకా ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

పిడుగుపాటుకు గురై ఆవు మృతి



మృతిచెందిన ఆవు

మర్రిగూడ: మండలంలోని కమ్మగూడ గ్రామంలో బుధవారం రాత్రి పిడుగుపడి ఆవు మృతిచెందింది. వివరాలు.. కమ్మగూడ గ్రామానికి చెందిన కాసర్ల జాను తన ఆవును పశువుల కొట్టేయగా.. బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసిన సమయంలో పిడుగుపడి ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. బాధిత రైతుకు ప్రభుత్వం తగిన ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటో, బైక్ ఢీ.. ఒకరు మృతి



నర్సింహ (ఫైల్)

గుర్రంపోడు: ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి గుర్రంపోడు మండలంలోని ముసీంఖాన్‌గూడెం గ్రామ శివారులో జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లికి చెందిన పంగ నర్సింహ(45) బైక్‌పై గురువారం తన అత్తగారి ఊరైన గుర్రంపోడు మండలం ముసీంఖాన్‌గూడేనికి వచ్చి రాత్రి తిరిగి తన స్వగ్రామానికి వెళ్తుండగా.. గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న ఆటో నర్సింహ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నర్సింహను దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నల్లగొండలో నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ హరిచందన



విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి



కౌంటింగ్ ప్రక్రియపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, అభ్యర్థి రాకేష్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



ఫలితాలపై చర్చిస్తున్న బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి తదితరులు



కౌంటింగ్ కేంద్రంలో బ్యాలెట్ పేపర్‌ను చూపుతున్న సిబ్బంది

భూ తగాదాలో చేయి చేసుకున్న ఎస్ఐ

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా దూషించాడని ఆరోపణ
- భువనగిరి డీసీపీకి ఫిర్యాదు చేస్తామని వెల్లడించిన బాధితులు

మోత్కూరు: భూ తగాదా పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన అన్నదమ్ములపై ఎస్ఐ చేయి చేసుకున్నాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం గ్రామానికి చెందిన ఎలుగు సతీష్, ఎలుగు మత్స్యగిరి అన్నదమ్ములు. వీరికి గ్రామంలోని 52, 53, 54 సర్వే నంబర్లలో వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆ భూముల పక్కన ఉన్న రైతులతో వారికి కొంతకాలంగా తగాదాలు జరుగుతున్నాయి. గురువారం ఇరువర్గాలు గొడవపడగా.. సతీష్, మత్స్యగిరి మోత్కూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిగిన విషయాన్ని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డికి చెబుతుండగా.. 'గట్టిగా మాట్లాడుతున్నారు ఏందిరా.., 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసే ధైర్యం ఎక్కడ నుండి వచ్చిందిరా' అంటూ ఎస్ఐ తమను దూషించారని సతీష్, మత్స్యగిరి పేర్కొన్నారు. ఫిర్యాదు ఇచ్చి రసీదు ఇవ్వమని అడగగా ఆగ్రహంతో ఎస్ఐ తమపై చేయి చేసుకున్నాడని తెలిపారు. ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని భువనగిరి డీసీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. అయితే సతీష్, మత్స్యగిరి తమకు ఉన్న భూమి కంటే అదనంగా కబ్జాలో ఉంటూ తమ భూమి గెట్లపై ఉన్న చెట్లను నరికివేస్తున్నారని అదే గ్రామానికి చెందిన వల్లపు నవీన్ తెలియజేశాడు.

ఆరోపణలు అవాస్తవం..

ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డిని వివరణ కోరగా.. మత్స్యగిరి, సతీష్‌ను తాను కొట్టినట్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. శాంతిభద్రతల దృష్ట్యా వారిద్దరితో పాటు వారితో భూ తగాదా ఉన్న రైతులను బైండోవర్ చేసి తహసీల్దార్ ముందు హాజరుపర్చామని పేర్కొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తిరుమలగిరి (తుంగతుర్తి): తన వ్యవసాయ క్షేత్రంలో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన కొడిదల ఉప్పలయ్య (52) గురువారం తన వ్యవసాయ క్షేత్రంలో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉప్పలయ్యకు ఫోన్ చేయగా అతడు లిఫ్ట్ చేయకపోవడంతో వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి భార్య కొడిదల నర్సమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. కాగా ఉప్పలయ్య ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియరాలేదు.

కుటుంబ కలహాలతో..

అడ్డగూడూరు: కుటుంబ కలహాలతో ఉరేసుకుని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన అడ్డగూడూరు మండలంలోని కంచనపల్లి గ్రామంలో గురువారం జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కంచనపల్లి గ్రామానికి చెందిన చేడే నరేష్, అతడి భార్య పూజిత (27) మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన పూజిత గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి రలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

నీట్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



సాయిచరణ్



శ్రీలేఖ



శ్రీనందన

నల్లగొండ: నీట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన కె. సాయిచరణ్ 610 మార్కులు, బి. శ్రీలేఖ 587, శ్రీనందన 561, డి.సాయిప్రసాద్ 559, ఎస్.రూపాంజలి 555, ఎం.మనోజ్ 551, బి.నవీన్ 549, డి.దూపంత్‌కుమార్ 547, జె.యశ్వంత్ 538, అప్రాము స్కాన్ 532, ఎస్.దినేష్ 519, ఆర్.చందనదుర్గ 514, డి.హనుమంతు 495, మహేంద్ర 482, సంతోష్ 475, ఎం.మోహన్ 474, అనురాధ 472, వై.వంశీ 464 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్ బాబు, ఎన్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డిలు అభినందించారు.

గౌతమి విద్యార్థుల ప్రతిభ



అఖిల్‌వర్మ



అక్షిత

నల్లగొండ పట్టణంలోని గౌతమి జూనియర్ కళాశాల విద్యార్థులు వి.అఖిల్ వర్మ 658 మార్కులు, కె.అక్షిత 551, నిషాత్ ఫాతిమా 506, అబ్దుల్ రెహమాన్ 511, ఫైజా అఫ్షీన్ 501, ఎ.పూజిత 501, సౌజన్య 496, ఫహద్ 475, లక్ష్మీసుధ 467, డి.మౌనిక 462, ఎం.నవ్య 456, యాస్మిన్ 452, టి.సౌమ్య 450, మహ్మద్ ఉజైర్ 453, సీహెచ్.శ్రీజ 440, లుబునా అంజుమ్ 432, నిత్యశ్రీ 430, శోభిత 417 మార్కులు సాధించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు కాసర్ల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్‌రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డి అభినందించారు.

'వ్యవసాయ పాలిటెక్నిక్'లో ప్రవేశాలకు ఆహ్వానం

- దరఖాస్తులకు ఈనెల 26వరకు గడువు
- పదోతరగతి మార్కులు, పాలిటెక్నిక్ ర్యాంక్ ఆధారంగా ఎంపిక



కంపాసాగర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల

త్రిపురారం : గ్రామీణ పేద విద్యార్థులకు స్వయం ఉపాధి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది త్రిపురారం మండలంలోని కంపాసాగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పరిశోధన క్షేత్రం. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను 2007లో ప్రారంభించారు. గ్రామీణ రైతుల ఉత్సాహం, అవసరాన్ని, నిరుపేద విద్యార్థుల ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ గ్రామీణ ప్రాంతాల్లో సైతం కళాశాలలను ఏర్పాటు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మొత్తం 240సీట్లు అందుబాటులో ఉన్నాయి.

కోర్సుకు అర్హత..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్టేట్ బోర్డు నిర్వహించే పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. సీబీఎస్‌సీ, ఐసీఎస్ఈ ఎన్ఐఓఎస్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీల అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం 35శాతం మార్కులు తప్పనిసరి. అగ్రికల్చర్ విభాగంలో తెలంగాణ పాలిసెట్ 2024లో ర్యాంక్ పొంది ఉండాలి. అభ్యర్థుల వయస్సు 2024 డిసెంబర్ 31నాటికి 15ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి 22 ఏళ్లు.

ఈనెల 26వరకు దరఖాస్తు గడువు..

2024–25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి. దరఖాస్తు మార్గదర్శకాలు, ఇతర వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. పీజేటీఎస్ఏయూ.ఈడీయూ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

ఫీజు వివరాలు..

జనరల్ అభ్యర్థులకు రూ.1200లు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ. 600
రిజిస్ట్రేషన్ ఫీజు చివరి తేది : జూన్ 25
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది : జూన్ 26
ఆన్‌లైన్ దరఖాస్తులో కరెక్షన్ : జూన్ 27

ఎంపిక విధానం..

పదోతరగతిలో వచ్చిన గ్రేడింగ్, పాలిటెక్నిక్ ర్యాంక్‌ల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నారు. అర్హులైన వారికి మాత్రమే సమాచారం అందిస్తారు.

రాష్ట్రంలోని కళాశాలల్లో సీట్ల వివరాలు..

- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ ప్రోగ్రాం వ్యవధి మూడు సంవత్సరాలు.
- సంగారెడ్డి కందిలోని అగ్రికల్చర్ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్‌లో 20సీట్లు అందుబాటు ఉన్నాయి. మెదక్‌లో తూని, ఖమ్మంలో సత్తుపల్లి, సంగారెడ్డిలో తుర్కల, ఖానాపూర్‌లో ఉన్న అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కో కళాశాలలో 30సీట్ల చొప్పున 90సీట్లు అందుబాటులో ఉన్నాయి.

హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో..

గరిడేపల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలగా గత సంవత్సరంలో డాక్టర్ ఘంటా గోపాల్‌రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్‌ను గడ్డిపల్లిలో స్థాపించారు. ఈ హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో 40సీట్లు అందుబాటులో ఉన్నట్లు కేవీకే కోఆర్డినేటర్ కె.నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి, స్కాలర్‌షిప్ సౌకర్యం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్ ప్రోగ్రాం వ్యవధి రెండేళ్లు.
- వికారాబాద్ గింగుర్తిలోని ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో 60 సీట్లు ఉన్నాయి.
- జోగిపేటలో బాలికల పాలిటెక్నిక్ కళాశాల, బసంత్‌పూర్, సమ్మికుంటా, మల్‌తుమ్మెదలలో బాలుర పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వాటితో పాటుగా పాలెం, పాలాస, కంపాసాగర్, మధిర, సిరిసిల్ల, రుద్రూర్, పాలిటెక్నిక్ కళాశాలలో ఒక్కో దానికిలో 20సీట్లు, నారాయణపేట పాలిటెక్నిక్ కళాశాలలో 40సీట్లు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా యూనివర్సిటీ కళాశాలల్లో మొత్తం 390సీట్లు ఉన్నాయి.